

# గుగులోత్ రమణి

ఆరోజు కూడా యింతే..ఒకటే వర్షం.

ఎడతెగని వర్షం.

చీకటి.

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై ఒంటరిగా..ఒంటరి బెంచీపై...ఒక్కడే,

ఎదురుగా వర్షంలో తడుస్తూ, కాంతి కడ్డీల్లా మెరుస్తూ రైలుపట్టాలు...దూరంగా ఎర్రని సిగ్నల్ లైట్..,

చుట్టూ..అంతా నిశ్శబ్దం.ఒట్టి వర్షపు చినుకుల చిత్రమైన చప్పుడు. గాలి నిండా తేమ..కొద్దిగా చలి,

ప్రక్కన నేలపై కుంయ్‌మని కదలి, యింకా దగ్గరగా ముడుచుకుని పడుకుంది గజ్జికుక్క.

ఎదురుగా పసుపుపచ్చరంగు బోర్డుపై నల్లని అక్షరాలు–డోర్నకల్ జంక్షన్.

...వర్షం, ఎడతెగకుండా కురుస్తూనే ఉంది.

## 2

..వర్షం, ఎడతెగకుండా కురుస్తూనే ఉంది.

ఖైరతాబాద్ స్టేషన్.

రాత్రి ఏడుగంటలు.

ప్లాట్‌ఫాంపై ఎవరూ లేరు.

బెంచీపై వీరు ఒంటరిగా కూర్చున్నాడు. ఎదురుగా దూరంగా ఎర్రని సిగ్నల్‌లైట్ తాము యిక తీసుకోవాల్సిన నిర్ణయంలా జ్వలిస్తూనే ఉంది.

అప్పుడంది...అతని ప్రక్కనే అప్పటినుండి మూర్తీభవించిన నిశ్శబ్దమై నిలబడ్డ గుగులోత్ రమణి–"మౌళి సార్ నిన్న రాత్రి సభలో చెప్పిన విషయాలను జాగ్రత్తగా విన్నావా వీరూ. యిన్నాళ్ళబట్టి నాలో జరుగుతున్న సంఘర్షణ నిన్న రాత్రి సార్ చెప్పిన సత్యంతో ముగిసి యిప్పుడు నా ముందు స్పష్టమైన ఒక నిర్ణయం రూపుదిద్దుకుని నిలబడ్డది.."

ఆమె కంఠం స్పష్టంగా ఉంది..నిర్దుష్టంగా ఉంది.

"సృష్టిలో దేన్నయినా తీసుకో...ఉదాహరణకు ఒక చెట్టు..అది నీడ నిస్తుంది, కాయలను, పండ్లను, ఆకులను, కర్రనిస్తుంది. కాని ప్రతిగా ఏమీ తీసుకోదు. నది నీళ్ళనిస్తుంది, ఇసుక నిస్తుంది. చల్లని గాలినిస్తుంది...యివ్వడమే.. ప్రతిగా ఏమీ తీసుకోదు. సృష్టి సృష్టంతా అంతే ఏదో ఒకటి యివ్వడమే... త్యాగం చేయడమే..మనిషి కోసం, జీవులకోసం అంతా పరిత్యాగించడమే. కాని మనిషి మాత్రం ఒకప్పుడు సృష్టికి ప్రతీకగా ఉన్నవాడు యివ్వడమనే సృష్టి మూలధర్మాన్ని మరిచి కేవలం తీసుకోడానికే ఎగబడి మనిషి మనుగడనే సంక్లిష్టం చేశాడు. మనిషంటే చివరికి దాచుకునేవాడు, దోచుకునేవాడుగా మిగిలిపోయాడు"

రమణి కళ్ళలో, దూరంగా ఎదురుగా ఉన్న ఎర్రని సిగ్నల్‌లైట్ కాంతి ప్రతిఫలిస్తోంది.

"సార్ చెప్పిందాని ప్రకారం ఈ దాచుకోవడమనేది ప్రకృతి విరుద్ధమైన ఒక దుర్మార్గ లక్షణం. ఏ జీవి ఐనా తనకు అవసరమైన ఆహారాన్ని కష్టపడి సంపాదించుకుంటుంది. ఆ రోజు గడుపుతుంది. రేపటికోసం దాచదు. రేపు మళ్ళీ వేట, అన్వేషణ. బతుకు నిత్యపోరాటం. ఒక నిరంతర తపన–ఐతే మనిషి అలాకాదు. సంపాదిస్తాడు..అనేక అక్రమమార్గాలద్వారా సంపాదిస్తాడు. ఎవరికీ పెట్టడు. రహస్యంగా దాస్తాడు. ఈ దాయడం అనే చర్య క్రమంగా దోపిడీ చేయడంగా మారుతుంది. చివరికి దాచుటకూ, దోచుటకూ ఒక పరిమితంటూ లేకుండా విశృంఖలమైపోతుంది. సరిగ్గా ఈ స్థితి దగ్గరే మానవ సమాజం భ్రష్టుపట్టి కకావికలైపోతోంది. దేశం చివరికి దోపిడీ చేసేవారూ, దోపిడీ చేయబడ్తున్న వారుగా స్పష్టంగా విడిపోతోంది.. మనం ఈ సంక్లిష్ట దశలో కొన్ని నిర్ణయాలు

తీసుకోవాలి వీరూ."

రమణి ఒక్క క్షణం ఆగింది.

వర్షం కురుస్తూనే ఉంది. ఉన్నట్టుండి ఒక ఈదురుగాలి తెప్ప ఇద్దర్నీ తాకుతూ వెళ్ళిపోయింది.

వీరు అతి జాగ్రత్తగా ఆమెను వింటున్నాడు. ఆమె చెప్పేదాన్ని లోతుగా అర్థం చేసుకుంటున్నాడు. తీవ్రంగా ఆలోచిస్తున్నాడు.

ఆ రోజు సాయంత్రమే రమణి ఉస్మానియా హాస్టల్‌లో ఉంటున్న వీరుకు ఫోన్ చేసి చెప్పింది. సాయంత్రం ఏడుగంటలకు ఖైరతాబాద్ స్టేషన్ ప్లాట్‌ఫాం పైకి రమ్మని. యిక రేపటితో తన ఇంజనీరింగ్ చదువు ముగిసి క్యాంపస్ ఇంటర్వ్యూలో తను సెలక్టయిన ఇన్ఫోసిస్‌లో రిపోర్ట్ చేయాలి. జీవితంలో చదువు అనే ఘట్టం ముగిసి కొత్త తలుపులు తెరుచుకోబోతున్నాయి.

రమణి వీరుకంటే ఒక సంవత్సరం సీనియర్. ఇద్దరూ లంబాడీ తెగకు చెందినవాళ్ళు. ఒకటే ఊరు. డోర్నకల్ స్టేషన్‌నుండి నూటా ముప్పయి కిలోమీటర్ల లోతట్టు ప్రాంతంలో, భద్రాచలం అడవుల్లో రాంనాయక్ తండా. యిద్దరిదీ ఒకటే స్కూల్. నిజానికి చదువు విషయంగా రమణి ముందు నడుస్తూంటే తను అడుగులో అడుగేసుకుంటూ వీరు వెంట నడిచారు. ఆమె ఏడవ క్లాసులో ఉన్నప్పట్నుండీ అంతే. ఆమె చదివిన పుస్తకాలు తనకిచ్చేది. రాసుకున్న నోట్స్ యిచ్చేది. అన్నింటినీ మించి చదువు ఏరకంగా మనిషిని తీర్చి దిద్దుతుందో విడమర్చి చెప్పేది. బురదలోనుండి తామరపువ్వులా మనందరం ఎదగాలని అనేది. ఎస్టీ కోటాలో కాకుండా జనరల్ కోటాలోనే సీట్లు సంపాదించుకుని తెలివి ఎవరి సొత్తూ కాదని ఋజువు చేయాలని హృదయాలను రగిలించేది. ఒక్కమాటలో చెప్పాలంటే తను రైలుకు ఇంజన్‌లా మారి తామందర్నీ డబ్బాల్లా వెంటేసుని ముందు నడిచేది.

ఆరోజు..రమణి తమ తండా నుండి ఎమ్‌సెట్‌లో పదవ ర్యాంక్ సాధించి జెఎన్‌టియులో కంప్యూటర్ ఇంజనీరింగ్ సీటు సంపాదించిన రోజు,

తమ తండాలో ఒక విభ్రాంతికరమైన పండగ.

దాదాపు ఎనభై కుటుంబాలు, చుట్టూ ఏ పంటా పండని ఐదువందల ఎకరాల రాళ్ళూ రప్పలు ఉన్న భూమిగల రాంనాయక్ తండాలో చదువుకోవడమనే అద్భుత ప్రక్రియను చేపట్టి చూపించింది రమణే. రోజూ పది కిలోమీటర్లు నడిచి పర్వతగిరి యుపిఎస్‌కు పోయి మొట్టమొదట ఐదవ తరగతిలో చేరిందీ రమణే. తర్వాత్తర్వాత తనూ, యింకొందరూ.,

పెద్దోళ్ళందరు వరంగల్‌కు కూలీకి పోవుడు. తట్ట మోసుడు, ఏదో తిని, ఏదో తాగి నాల్గురూపాయలు మిగుల్చుకుని వారం, పదిరోజులకోసారి తండాకొచ్చి యిచ్చి, తాగి తందనాలాడి మళ్ళీ కూలీకి వెళ్ళిపోవడం. ఊళ్ళో వ్యవసాయం లేదు. కరెంటు లేదు. బావులు లేవు. రోడ్లు లేవు. బస్సుల్లేవు. చుట్టూ

గుట్టలు. ప్రక్కన అడవి. నిరంతరం ఆకలి, కష్టాలు, రోగాలు, దిక్కులేనితనం.,

తన ఎస్సెస్సీ ఐపోగానే రమణి తనను వరంగల్‌కు తీసుకుపోయి ఎస్టీ హాస్టల్‌లో చేర్పించి ఇంటర్‌లో ఎమ్‌పీసీ తీసుకొమ్మని చెప్పి-యిక ముందుకు చొచ్చుకుపొమ్మని మార్గదర్శనం చేసింది. తనూ బాలికల హాస్టల్‌లో ఉండేది. ఎప్పుడు చూసినా జిల్లా గ్రంథాలయంలో పుస్తకాలు చదువుతూ కనిపించేది.

"వీరూ..మన ఊరినుంచి భూమిలోనుండి మొలకల్లా బయటికొచ్చిన మనం ఏదైనా సాధించి ఈ ప్రపంచానికి ఒక అద్భుతాన్ని చూపించాలి వీరూ.." అని అనేది ఎప్పుడూ.

అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళలో తీక్షణమైన వింత కాంతి కనబడేది.

"ఏం చేద్దాం" అని తను అన్నపుడు,

"అదే ఆలోచిస్తున్నా...ఇంజనీరింగ్ చేస్తున్న ఈ నాలుగేళ్ళుగా అదే ఆలోచిస్తున్న వీరూ..ఐతే ముందు మనం మన చదువును విజయవంతంగా పూర్తి చేయాలి. చదువే మన విజయానికీ, భవిష్యత్తుకూ సాధనం. క్యాంపస్ సెలక్షన్‌లలో ఉద్యోగం సంపాదించాలి...అక్కడ్నుంచి మన ప్రయాణం షురూ" అనేది.

ఆమె ఇంజనీరింగ్ చేస్తున్నప్పుడు వాళ్ళ ప్రొఫెసర్ మౌళి సార్‌తో ఎప్పుడూ జీవితం గురించి చర్చించేది. అతన్నుండి ఎంతో ప్రేరణ పొందేది. ఆయన చెప్పినట్టుగా జీవితాన్ని నీతివంతంగా, అర్థవంతంగా జీవించడం నేర్చుకోవాలని తపించేది. తనతోనూ చెప్పేది.

ఏది నీతివంతం..ఏది అర్థవంతం-అని చర్చించేది.

తను ఫైనలియర్‌లో ఉన్నపుడు రమణికి ఇన్‌ఫోసిస్‌లో క్యాంపస్ సెలక్షన్ వచ్చి జాయినైంది. జీతం యిరవై ఐదు వేలు. మొదటి జీతం తీసుకున్న రోజు తనకోసం పదివేలు ఉంచుకుని మిగతా పదిహేను వేలు తీసుకుని తనను వెంటపెట్టుకుని తమ తండాకు తీసుకెళ్ళింది రమణి. ఊరు ఊరందరికీ మంచి బట్టలు సమకూర్చి, ఊరి మంచినీళ్ళ బావి పూడిక తీయించి శాశ్వతంగా తాగడానికి నీళ్ళను ఏర్పాటు చేసింది. యిక అక్కడ్నుంచి ప్రతినెలా పదిహేను వేల రూపాయలు ఊరికోసమే ఖర్చు చేసేది.

తను ఎంతో ఆశ్చర్యపోయేవాడు. మనుషులు ఈ రకంగా కూడా ఉంటారా అనిపించేది. రమణికి తండ్రి లేదు. ఒక ముసలి తల్లి మాత్రమే ఉండేది. పేరు లచ్చిమి.

ఒక ఏడాది కాలంలో రాంనాయక్ తండా రూపురేఖలు కొంత మారాయి. మట్టి రోడ్లు పోయించింది. ప్రైమరీ పాఠశాలకు ఒక గూనపెంకల పాక ఏర్పర్చింది. వీధి లైట్లు వచ్చాయి. చదువుకోవడం గురించి అందరి మనస్సుల్లో నిప్పు రాజుకుంది.

ఇప్పుడు తను కూడా ఇంజనీరింగ్ పూర్తిచేసిన ఈ కీలక సందర్భంలో – "వీరూ.. ఈరోజు మనం మనకోసం, మన ఊరు కోసం, మనం అర్థవంతంగా జీవించడం కోసం కొన్ని అతిముఖ్యమైన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంది. అందుకోసం సరిగ్గా ఏడు గంటలకు ఖైరతాబాద్..." అని రమణి నుండి ఫోన్ వస్తే..,

ఉన్నట్టుండి ఆకాశం ఫెళఫెళమని ఉరిమింది. ఎక్కడో పిడుగు పడింది.

రమణి ప్రారంభించింది–"వీరూ, నాకు స్టేట్స్‌లో పొలారిస్ అనే కంపెనీలో ఉద్యోగమొచ్చింది. హెచ్‌వన్ ప్రాసెసింగ్, స్టాంపింగ్ అంతా ఐపోయింది. జీతం ఎయ్‌టి కే, వచ్చే యిరవై రెండో తేదీన జాయిన్ కావాలి. ఇప్పటి ఈ స్థితిని నేను కూలంకషంగా ఆలోచించి ఒక ప్రపోజల్ తయారు చేశాను. నువ్వు సావధానంగా, ధైర్యంగా వింటావా" అంది.

వర్షం కురుస్తూనే ఉంది.

ప్లాట్‌ఫాంపై ఎవరూ లేరు.

ఒట్టి చినుకుల చప్పుడు..ఒక శృతి..ఒక లయ,

వీరు అప్పుడే ప్రత్యక్షమైన దేవత ముఖంలోకి చూస్తున్నట్టుగా... అప్రతిభుడై..పరవశుడై,

"మౌళి సార్ చెప్పిందే శరణ్యం మనకు–ఒక మెమరీ సిస్టం అతిసూక్ష్మమైన ఎన్నో అడ్రస్‌ను కలిగి ఉన్నట్టుగా ఈ దేశం అనే వ్యవస్థ వేల వేల గ్రామాలను అరలు అరలుగా కలిగి ఉంది. ప్రతి అర ఒక ఆరోగ్యవంతమైన డొమైన్‌గా రూపుదిద్దుకుంటే ఈ దేశం ఒక స్వర్గంగా మారుతుంది. ఐతే దురదృష్టవశాత్తు యిప్పుడున్న మన సామాజిక వ్యవస్థ ఎట్లున్నదంటే..అది పూర్తిగా కుళ్ళిపోయింది. నైతిక విలువలు లేవు. నీతి నియమాలు లేవు. మనుషులకు సిగ్గూ లజ్జా లేవు. లంచగొండితనం, అవినీతి, విచ్చలవిడితనం, దౌర్జన్యం, దోపిడీ హద్దులు దాటిపోయాయెప్పుడో. ఎవరినీ ఎవడూ నియంత్రించే వాతావరణం లేదు. వేలకోట్ల రూపాయలనైనా బకాసురుల్లా భోంచేసి మర్నాటికి ఆవులిస్తారు. అన్నింటికన్నా విషాదమైన విషయమేమిటంటే వర్తమాన భారత సమాజానికి నిరక్షరాస్యులకంటే బాగా చదువుకున్న వైట్‌కాలర్డ్ వ్యక్తులతోనే ప్రమాదముంది. వాళ్ళే కోట్లకొద్దీ ఈ దేశ సంపదను స్వాహా చేస్తున్నారు. ఈ స్థితిలో మన ఊరిని... అంటే ఈ దేశంలో ఒక చిన్న 'అర' వలె ఉన్న మన కుగ్రామాన్ని ఎవడూ బాగుచేయడు. అది మన కన్న తల్లి. దాన్ని మనమే ముందుబడి ఏదన్నా చేయాలి. మన ఊరిని మనమే బాగుచేసి..యిలా చేయడం సాధ్యమే అని చేసి చూపి ఈ ప్రపంచానికి మనం ఒక ఉదాహరణ కావాలి. అది అసాధ్యం కాదు–"

"చెప్పు రమణి..." అన్నాడు వీరు.

"మన ఊరు గురించి సంపూర్ణంగా అవగాహన ఉన్నవాళ్ళం మన

యిద్దరమే. మన ఊరును ఒక స్వర్గం చేయాలనే తపన ఉంటే మనిద్దరికే ఉండాలి. వేరే వాళ్ళెవరికీ ఈ సుందర స్వప్నకాంక్ష ఉండదు...అందువల్ల ముందు మనిద్దరం కలిసి ఒక నిర్మాణాత్మక శక్తిగా ఎదగాలి."

"అంటే"

"వయసులో నేను నీకంటే ఒక సంవత్సరం పెద్దదాన్నయినా ఫర్వాలేదు.. మనం పెళ్ళి చేసుకుందాం. నేను ముందు యుఎస్సేకు వెళ్ళి నాల్గయిదు నెలల్లో నిన్నుకూడా డిపెండెంట్ వీసామీద అక్కడ ఫిక్సప్ చేస్తా.ఇద్దరం స్టేట్స్‌లో పనిచేస్తున్నపుడు..మనవి రెండు జీతాలు..మౌళిసార్ థియరీ ప్రకారం, ప్రకృతి సిద్ధాంతరీత్యా మనక్కావలసిన ఒకరి జీతాన్ని మనకోసం ఉంచుకుని, మరొకరి జీతాన్ని మొత్తం మన ఊరి పునర్నిర్మాణం కోసం ఉపయోగిద్దాం-"

వీరు నిజంగా షాకయ్యాడు. ఈమె ఏం మాట్లాడ్తోంది - అని క్షణకాలం పిచ్చివాడయ్యాడు. ఈమెకు భవిష్యత్తుపై ఎంత స్పష్టమైన ప్రణాళిక ఉంది - అని ఆశ్చర్యపడ్డాడు. వింటున్నాడు మాటలుడిగి.,

"ఏ ఊరినైనా ఎవరో ఎక్కడనుండో వచ్చి ఉద్ధరిస్తారనే నమ్మకం ఈ రోజుల్లో అసలే లేదు. ముందు మన ఊరిని ఎటువంటి రాజకీయాలు తాకకుండా ప్రక్షాళన చేద్దాం. చదువు సంధ్యలు లేని అమాయకులైన మన ఊరిజనం ఒట్టి పచ్చి మన్ను ముద్దల్లాంటివారు. ఏ ఆకారంలో పిసుకుతే ఆ ఆకారమే వస్తుంది. ముందు మన ఊరంతా ఒక్కటి, మనమంతా ఒక్కటి...నుండి ప్రారంభించి పునాదులనుండి ఒక నూతన గ్రామాన్ని నిర్మించాలి. అందుకు మనలో ఒకరి పూర్తి జీతాన్ని వెచ్చిస్తున్నామంటే..అది చిన్న విషయంకాదు. అంటే దాదాపు ఏడాదికి మనం నలభై లక్షల రూపాయలు ఖర్చు పెడ్తాం. నాలుగేళ్ళవరకు మనం పిల్లలను కనం. అప్పటికి దాదాపు రెండు కోట్ల రూపాయలు మన ఊరికి చెందుతాయి. ఆ నాలుగేళ్ళలో...రోడ్లు, పాఠశాల, ఆస్పత్రి, గ్రంథాలయం, ఊరికి చెందిన భూమిని అందరికి చెందిన భూమిగా చేసి...ఊరు ఊరంతా ఒక యూనిట్, ఊరి సంపదంతా ఊరిదే, ఊరి కష్టసుఖాలు ఊరివాళ్ళందరివి... ఊరంటే ఒక కుటుంబం..ఒక అవిభాజ్యమైన వ్యవస్థ...నైతిక విలువలకు కట్టుబడి ప్రేమ, వాత్సల్యాలతో బంధింపబడ్డ ఒక మాన సమూహం."

"......" వీరు వింటున్నాడు నిశ్శబ్దంగా.

అతని కళ్ళలో స్వప్నాలు సాకారం కావడం సాధ్యమవడమంటే యిదేనా అన్న తృప్తి తాలూకు ప్రతిఫలనలు కనిపిస్తున్నాయి.

"యిది అసాధ్యమేమీకాదు వీరు. మనమిద్దరం కలిస్తే ఆర్థికంగా, భౌతికంగా, నైతికంగా ఒక బలమైన శక్తి ఏర్పడ్తుంది. మనం చిరస్థాయిగా జనంలో దేవతలమై జీవిస్తాం. భవిష్యత్తులో ఎందరికో మనం ఒక ఉదాహరణగా, ఒక ఉత్తేజంగా, స్ఫూర్తిగా నిలుస్తాం. ఎవరి ఊరిని వాళ్ళు బాగు చేసుకుంటే ఈ

దేశమే బాగుపడ్తుంది కదా అని చేసి చూపించినవాళ్ళమౌతాం..ఇందుకుగాను మనం నిజంగా చేసే త్యాగం కూడా పెద్దగా ఏమీలేదు. ఒకరి జీతంతో మనం ఎంతో సంతోషంగా ఉంటూనే-మరొకరి జీతంతో ఎందరి జీవితాలనో ఉద్ధరిద్దాం...ఏమంటావ్..."

వీరుకు ముందు సాహసియైన ఆమెను చూస్తే భయమేసింది. మరుక్షణం భవిష్యత్తుపై యింత నిబద్ధత, విశ్వాసం, ఉన్నత ఆశయం ఉన్నందుకు ఆనందం కలిగింది. సహృదయత ఉంటే ఒక్క స్త్రీమూర్తివల్ల దేశస్వరూపాన్నే మార్చగలిగే అద్భుతం ఎలా ఒక సజీవ స్వప్నమౌతుందో తెలిసి ఆశ్చర్యం కలిగింది.

జవాబుగా ఆమె ముందు అవాక్కయి నిలబడి..అంగీకారాన్ని తెలియజేయడానికి చూపులతో ప్రయత్నించాడు.

" ఏమంటావ్ వీరూ.." అంది రమణి

" నీవెంట నేనుంటా రమణీ...చాలా గర్వంగా" అని కలలోలా అన్నాడు.

ఆమె తృప్తిగా అతని కన్నుల్లోకి చూస్తుండగా,

ఎక్కడో పిడుగుపడింది ఫెటేళ్ళున.

వర్షం కురుస్తూనే ఉంది కుండపోతగా.

ఆ రాత్రి..ఆ వర్షంలో..ఆ ఒంటరి ప్లాట్‌ఫాంపై..ఒక ఆలోచన మొగ్గతొడిగి...ఇద్దరు వ్యక్తులు...ఒక శక్తిగా ఎదిగి..

## 3

నాలుగేళ్ళు గడిచి..,

వీరు డోర్నకల్ జంక్షన్ ప్లాట్‌ఫాంపై నున్న ఒక ఒంటరి బెంచీపై కూర్చుని,

ఇంకా వర్షం కురుస్తూనే ఉంది.

ఎదురుగా రైల్వే గడియారం..ఐదుగంటల పది నిముషాలు.

ఆరుగంటలకు భద్రాచలంరోడ్ పాసింజర్..అక్కడి నుండి భద్రాచలంకు..బస్సులో..అక్కడినుండి..ప్రైవేటు జీపులో ప్రయాణం...గంటన్నర... కాని...ఒకసారి తమ ఊరికి చేరితే...

ఒక స్వర్గం..ఈ నాలుగేళ్ళలో రమణీ, తనూ కలిసి రూపుదిద్ది మలచిన స్వర్గం.

రమణీ చాలాసార్లు వచ్చింది యిక్కడికి అమెరికానుండి..స్వయంగా అక్కడ ఉండి పనులు చేసింది. చేయించింది. ఊరి జనమందరికి తల్లిలా నిలిచింది.

యిప్పుడు ఊరికి..స్వంత చెరువు, స్వంత చెక్‌డ్యాం, ఊరి పొలాలన్నీ

అందరికి చెందిన సమిష్టి వ్యవసాయం, సమిష్టి రాబటి. సమిష్టి జీవనం...ఏదీ ఒక్కరిది కాదు..అన్నీ అందరివి. ఊళ్ళోకి ఏ రాజకీయ పార్టీకి ప్రవేశం లేదు. ఏ విషయమైనా ఒక పెద్దల సంఘం కూర్చుని నిర్ణయం తీసుకుంటుంది. కీలక సందర్భాలన్నింటిలో రమణిని సంప్రదిస్తారు. గత రెండేళ్ళుగా పత్రికల్లో, మీడియాలో, అంతర్జాతీయ వేదికలపై రాంనాయక్‌తండా ప్రస్తావన. ఎందరికో ఒక సజీవ స్ఫూర్తిగా భాసిస్తున్న అపూర్వ మావన ప్రయత్నం. సాకారమైన స్వప్నం.. రూపుదిద్దుకున్న సిద్ధాంతం.

వీరు జేబును తడుముకున్నాడు. ఎనభైవేల డాలర్ల చెక్ తాకింది.

వచ్చేప్పుడు రమణి చెప్పింది. ఈ దాదాపు నలభై లక్షల రూపాయలతో చేయవలసిన పనులను. నిజానికి ఈసారి కూడా ఆమెనే రావలసి ఉండె. కాని ముందే అనుకున్న ప్రకారం నాలుగేళ్ళు దాటుతోంది కాబట్టి,

రమణి గర్భవతి..ఓ శిశువుకు జన్మనివ్వాలిక..అందుకే ఆమె వాషింగ్టన్‌లోనే ఉండిపోయింది. వీరు బయలుదేరాడు కర్తవ్య నిర్వహణకు.

వీరుకు ఎందుకో చిన్నగా నవ్వొచ్చింది –

కర్తవ్యం ఊరుపట్లగానీ, సంఘంపట్లగానీ, ఒక దేశం పట్లగానీ ఎప్పుడూ భుజంపై మోస్తున్న జెండా వంటిది. ఒక వ్యక్తి జెండాను మోస్తూ మోస్తూ, నడచీ నడచీ..పరుగు తీసీ తీసీ..మళ్ళీ ఎవరో వస్తారు జెండాను ఒక బాధ్యతగా తమ భుజాన స్వీకరించేందుకు..తర్వాత యింకొకరు...ఆ తర్వాత మరొకరు..అదొక నిరంతర అనంతయాత్ర..

రమణి..తను..తర్వాత ...ఎవరో..ఈ జెండా మోసేవారు,

వీరు షర్ట్ జేబులోని సెల్‌ఫోన్ మ్రోగింది.

అసంకల్పితంగా తీసి "హల్లో" అన్నాడు వీరు.

"ఎక్కడున్నావు" రమణి కంఠం.

"డోర్నకల్ జంక్షన్ ప్లాట్‌ఫాంపై. పావుగంటలో రైలొస్తుంది'

పుట్టబోయే శిశువు జెండర్ గురించి లీగల్‌గానే చెప్పే సౌకర్యమున్న అమెరికాలో..రమణి ఎప్పుడూ పుట్టబోయే శిశువు ఆడనో, మగనో తెలుసుకునే ప్రయత్నం చేయలేదు..ఉత్సుకత కూడా చూపలేదు.

"కంగ్రాచ్యులేషన్స్..నీకో గుడ్‌న్యూస్..బాబు మనకు."

"ఓ..యిట్స్ ఫైన్..అభినందనలు..ఆర్ యు బోత్ సేఫ్"

"ఔను...డాక్టర్ అడుగుతున్నాడు..కిడ్ పేరు చెప్పమని"

"మనం అనుకున్నాంగదా రమణీ...అదే పేరు...సూర్య–వాడేకదా

ఈ మన ఊరి బాధ్యతలను మన తర్వాత భుజాలపై మోయవలసింది..సూర్య పేరునే ఎంటర్‌చెయ్"

"ఓకె...." యింకా ఏదో అంటోంది రమణి.

అంతలోనే ప్యాసింజర్‌రైలు ప్లాట్‌ఫాంపైకి రావడం మొదలై.. కోలాహలం..ఒక జీవధ్వని..నడక,

చొచ్చుకొస్తున్న రైలుపైనుండి..అప్పుడే తెలతెలవారుతూ., ఉదయిస్తున్న ఎర్రని సూర్యుడు.

వీరు ఉదయ సూర్యునిలోకి సూటిగా చూశాడు.

కళ్ళు జిగేలుమన్నాయి.

వర్షం కురుస్తూనే ఉంది...కుండపోతగా-

●

'విపుల' మాసపత్రిక
సెప్టెంబర్ 2008